ప్రజాశక్తి
బుధవారం 24 జులై 2024
5
అనంతపురం





వైద్యాధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రతి వ్యాధికీ చికిత్స అందించాలి

◆ జిజిహెచ్‌లో డాక్టర్లంతా ఉండాలి ◆ కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్


అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ప్రతి వ్యాధికీ చికిత్స అందించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక ఉండాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ ఆదేశించారు. మంగళవారం ఉదయం అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని పీడియాట్రిక్ విభాగంలో తలసేమియా నివారణ, నిర్వహణపై నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో తలసేమియా నివారణ, నిర్వహణపై కార్యక్రమాన్ని ప్రారంభించడం అభినందనీయం అన్నారు. వచ్చే సోమవారం నుంచి జిల్లాలో ఉన్న ప్రతి పిహెచ్‌సి, సిహెచ్‌సి, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రి ఎన్క్వెర్ సర్టిఫికేషన్ కోసం వెళ్లాలన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి కూడా ఎనిపిహెచ్ సర్టిఫికేషన్ కోసం వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి సోమవారం సమీక్ష ఉంటుందని, జిజిహెచ్ అభివద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెద్ద ఆస్పత్రి అయిన ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మరిన్ని పనులు చేయాల్సి ఉందని, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమర్ యాదవ్ తమతో అన్నారన్నారు. డాక్టర్లు నిత్యం వారికి కేటాయించిన స్థానంలో కూర్చోవాలని, జిజిహెచ్‌లో ఎక్కడా ఖాళీ కుర్చీలు ఉండరాదన్నారు. అనంతరం తలసేమియా ప్రివెన్సెస్ అండ్ మేనేజ్మెంట్ ప్రోగ్రాంకు సహకరించిన బెంగళూరు సంకల్ప్ ఫౌండేషన్ సీఈవో రాకేష్ ను కలెక్టర్ సన్మానించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డా॥వెంకటేశ్వరరావు, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మాణిక్యరావు, బెంగళూరు సంకల్ప్ ఫౌండేషన్ సీఈవో రాకేష్, ఆస్పత్రి డిసిఎస్ ఆర్ఎంఒ హేమలత, జిజిహెచ్ పీడియాట్రిక్స్ డిపార్టెమెంట్ ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడి డా॥రవికుమార్, గైనకాలజీ డిపార్ట్మెంట్ హెచ్‌వోడి డా॥శంషాద్ బేగం, ఆర్ఎంఒ పద్మజ, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్యాకేజీలో పైసలెన్నో..?

◆ కేంద్ర బడ్జెట్‌లో నిధులపై కొరవడిన స్పష్టత

◆ కేంద్రీయ విశ్వవిద్యాలయంపైనా అదే స్థితి

◆ ఈ సారీ నిరాశే అంటున్న ఉమ్మడి జిల్లా వాసులు





ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన ఆర్థిక బడ్జెట్‌లో రాయలసీమ వెనుకబడిన ప్రాంతాలకు ప్యాకేజీ అన్న ప్రకటన ఉంది. దీని పట్ల బిజెపితోపాటు కూటమి నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్యాకేజీలో నిధులు ఏ మేరకన్న స్పష్టత లేదని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రధానంగా వామపక్ష పార్టీలు ఈ అంశాన్ని లెవనెత్తుతున్నాయి. ఇదే రకంగా గతంలో ప్యాకేజీ అని ఏడాదికి రూ.50 కోట్ల చొప్పున మూడు సంవత్సరాలు నిధులు కేటాయించి తరువాత అటకెక్కించారని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు ఈ ప్యాకేజీ కూడా అదే తరహాలోనే ఉంటుందా నిధులు ఏమైనా కేటాయిస్తారా అని ప్రశ్నిస్తున్నారు. కేటాయిస్తే ఎన్ని నిధులు కేటాయిస్తారన్న దానిపైనా స్పష్టతనివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ఎన్నికలకు ముందు ఓట్‌ఆన్ అకౌంట్‌గా ప్రవేశపెట్టారు. ఇప్పుడు పూర్తి స్థాయి బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ పూర్తి స్థాయిలో నిరాశపరిచే విధంగా ఉందన్న జిల్లావాసులు పెదవి విరుస్తున్నారు.

కేంద్రీయ విశ్వవిద్యాలయానికి నిధులు నామమాత్రమేనా ?

రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసిన కేంద్రీయ విశ్వవిద్యాలయంకు నిధుల కేటాయింపులపై స్పష్టత లేదు. ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్‌లోనూ నిధుల కేటాయింపులు జరగలేదు. అంతకు మునుపు ఏడాది కేటాయించిన నిధులతో మొదటి క్యాంపస్ నిర్మాణాలు పూర్తికావచ్చాయి. ఇంకా అనేక విడతల్లో పనులు చేపట్టాల్సినవి ఉన్నాయి. వాటికి నిధులు ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయింపులు నామ మాత్రమేనన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గుంతకల్లు డివిజన్‌కు ప్రాధాన్యత తక్కిందా..!

గుంతకల్లు రైల్వే డివిజన్‌కు నిధుల కేటాయింపులు ఏ మేరకు జరగాయన్నది తెలియాల్సి ఉంది. పింక్ బుక్ వచ్చాక కేటాయింపులపై స్పష్టత వస్తుంది. గత బడ్జెట్‌లలో గుంతకల్లు డివిజన్‌కు పెద్దగా కేటాయింపులు జరగలేదు. ఈ బడ్జెట్‌లోనూ పరిస్థితి ఏమిటన్నది స్పష్టత కావాల్సి ఉంది.

మాటలు సరే.. నిధులేవి..?


వి.రాంభూపాల్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు.



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వెనుకబడిన రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించింది. గత పది సంవత్సరాల క్రితం విభజన చట్టంలో భాగంగా వెనకబడిన ప్రాంతాల అభివద్ధికి బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ గురించి హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఆ ప్యాకేజీ అమలు కాలేదు. ఆర్థికమంత్రి ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్ పేరు పలుసార్లు ప్రస్తావించారు. కానీ నిధులు కేటాయింపు మాత్రం నిరాశను కలిగించింది. చెప్పిన మాటల్లో కూడా స్పష్టత లేదు. ఉద్దేశపూర్వకంగానే రాష్ట్ర ప్రజల్ని మోసగించడానికి కేంద్రం ప్రయత్నించింది. రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్ల రూపాయలు పలు ఆర్థిక సంస్థల ద్వారా ఇప్పిస్తామని మంత్రి పేర్కొనటం వల్ల రాష్ట్రానికి, రాజధానికి మేలు జరగదు. 15 వేల కోట్ల రూపాయలు నేరుగా గ్రాంటుగా ప్రకటించాలి. పోలవరం, వెనుకబడిన ప్రాంతాల అభివద్ధి, విభజన హామీల అమలు కట్టుబడి ఉంటామని చెప్పారే తప్ప వాటికి నిధుల ప్రస్తావన లేదు. పోలవరానికి 12 వేల కోట్లు కావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినా బడ్జెట్‌లో స్పందన లేదు. రైల్వే జోన్, కడప ఉక్కు, మెట్రో, విద్య, వైద్య సంస్థలు తదితర చట్టబద్ధమైన హామీలు బడ్జెట్‌లో చోటు చేసుకోలేదు. పుణ్యక్షేత్రాల టూరిజం, వరద నివారణ చర్యలు తదితర విషయాల్లో అనేక రాష్ట్రాలకు నిధులు కేటాయించినా, ఆంధ్రప్రదేశ్, తెలుగు రాష్ట్రాల ప్రస్తావన లేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, తెలుగుదేశం, జనసేన పార్టీలు కేంద్రంపైనా, బిజెపిపైనా రాజకీయ ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాబట్టుకునేలా పోరాటం చేయాలి.

బడ్జెట్‌లో అన్యాయం

ఎన్.రఘువీరారెడ్డి, సిడబ్ల్యుసి మెంబర్



కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 11వ బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్రమైన అన్యాయం చేసింది. ప్రత్యేక హోదా ఊసే లేకపోవడం విచాకరం. పోలవరంపై మాట తప్పా, మరేది స్పష్టమైన హామీ లేదు. రాజధాని నిర్మాణానికి ఇచ్చిన రూ.15 వేల కోట్లు రుణంగా ఇచ్చిందా.. లేదా రాజధాని నిర్మాణానికి నిధులు కింద ఇచ్చిందా అన్న దానిపైనా స్పష్టత లేదు. ఎన్డీఏ ప్రభుత్వంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు మద్దతుతో ఉండడంతో రాష్ట్రానికి పెద్ద ఎత్తున నిధులు వస్తాయని అందరూ ఆశించారు. అయినా నిరాశే మిగిలింది. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరణ చేయమని చెప్పలేదు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతీయ పార్టీలు కలిసికట్టుగా పోరాడి నిధులను తెచ్చుకునేందుకు కేంద్రంపై పోరాటం చేయాలి.

నిధులు శూన్యం



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయించిన నిధులు శూన్యం. అమరావతి అభివద్ధికి రూ.15వేల కోట్లు అప్పుగా కాకుండా నేరుగా గ్రాంట్ ప్రకటించకుండా మోసం చేశారు. అప్పుగా ఇవ్వడం వల్ల రాష్ట్రం మరింత ఆర్థిక సంక్షోభంలోకి వెళ్తుంది. విభజన చట్టం ప్రకారం 2014 నుంచి వెనుకబడిన ప్రాంతాలకు రూ.2000 కోట్లు విడుదల చేయాల్సున్నా దానిపై ప్రకటన చేయలేదు. ప్రత్యేక హోదా విషయాన్ని గాలికి వదిలేసారు. ఏ విధంగా చూసినా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్యాయం జరిగింది.

జాఫర్,
సిపిఐ జిల్లా కార్యదర్శి.

వేతన జీవులకు నిరాశ

కేంద్ర బడ్జెట్‌లో వేతన జీవులకు మరోసారి నిరాశ మిగిలింది. పాత పన్నుల విధానంలో ఎలాంటి మార్పు చేయకుండా కొత్త పన్నుల విధానంలో మాత్రమే మార్పులు చేశారు. దీనివల్ల వేతన జీవులకు ఎలాంటి మేలూ జరగదు. పాత పెన్షన్ విధానంపై బడ్జెట్లో ప్రస్తావన లేదు. ఉద్యోగుల ఇన్కమ్ టాక్స్ సంబంధించి పాత పద్ధతి కంటే కొత్త విధానంలో పన్ను ఎక్కువ చెల్లించాల్సి రావడంతో ఉద్యోగులు పాత విధానానికి మొగ్గు చూపుతున్నారు. విద్యారంగానికి బడ్జెట్లో కేటాయింపులు ఆరు శాతం కేటాయించాల్సి ఉండగా 3.25 శాతం మాత్రమే కేటాయించారు. ఉద్యోగాల కలపునపై ప్రస్తావన చేయలేదు. మధ్యతరగతి ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చేలా పాత పెన్షన్‌ను పునరుద్ధరించే దానిపై ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వలేదు.

జయచంద్రారెడ్డి, సుధాకర్
యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు.
శ్రీసత్యసాయి జిల్లా.

గృహ నిర్మాణాల్లో 'రాక్రీట్' అక్రమాలు

విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి, మంత్రికి పరిటాల సునీత ఫిర్యాదు

ప్రజాశక్తి-ఆత్మకూరు



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి రాక్రీట్ సంస్థ పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిందని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆమె సీఎం క్యాంప్ కార్యాలయానికి వెళ్లి అన్ని అంశాలను వివరించారు. గహనిర్మాణ శాఖ మంత్రి పార్ధసారథిని కలిసి జగనన్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి రాక్రీట్ సంస్థ పేరుతో అప్పటి ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి కాంట్రాక్టు తీసుకున్నారని, ఇళ్ల నిర్మాణాలు చేయకుండా రూ.200 కోట్లు డబ్బులు కాజేశారన్నారు. రూ.1,100 కోట్ల విలువైన పేదల ఇళ్ల నిర్మాణాన్ని అప్పటి వైసిపి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి బంధువు, అనుచరవర్గం డైరెక్టర్లుగా ఉన్న గుత్తేదారు సంస్థ రాక్రీట్ సంస్థకు తీసుకుని డబ్బులు కాజేశారన్నారు. దీనిపై విచారణకు ఆదేశిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. రామగిరి మండలంలోని అప్పర్ పెన్నార్ ప్రాజెక్ట్ (పేరూరు)కు నీరందించే పనులు మళ్లీ ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. రిజర్వాయర్ కోసం రైతులు భూములు ఇచ్చారని, ఆ రైతులకు నేటి ధరల ప్రకారం పరిహారం మంజూరు చేయాలని కోరారు. ఎన్నికల హామీగా పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి రిజర్వాయర్లు నిర్మించి పేరూరుకు నీరందిస్తామని హామీ ఇచ్చినట్టు వివరించారు. రామగిరి మండలం నసనకోటలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను ఇంటర్మీడియట్ వరకు ఉన్నతీకరించాలని బీసీ సంక్షేమ మంత్రి సవిత, సంబంధిత శాఖ సెక్రటరీకి వినతి పత్రం అందజేశారు. వచ్చే ఏడాది నుంచి ఇంటర్మీడియట్‌కు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీవిశ్వనాథ ఆచారి

ప్రజాశక్తి-గుత్తి

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీవిశ్వనాథ ఆచారి సూచించారు. మంగళవారం గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో మోటారు వాహనాల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు నడిపే విద్యార్థులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే.పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ఎండి జి.రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సురయ, హెచ్ఓడి హరిప్రియ, న్యాయవాది వీసీ.గంగాధర్ కుమార్, కోర్టు టైపిస్ట్ ఎస్.సాదిక్‌వలి, నరసింహనాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీవిశ్వనాథ ఆచారి

ఎన్నికల వాహనాల బాడుగ జమ

ప్రజాశక్తి-అనంతపురం

ఇటీవల జరిగిన ఎన్నికల్లో జిల్లాలో వాహనాలను ఏర్పాటు చేసిన వాహన యజమానుల సంబంధించిన నగదును వారికి ఖాతాల్లో జమ చేసినట్లు జిల్లా ఉప రవాణా కమిషనర్ ఎం.వీర్రాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేసిన వాహనాలకు ఎన్నికల తేదీ 13-05-2024 తేదీ నాటికి ఏర్పాటు చేసిన వాటికి సంబంధించి రూ.2.08కోట్లు ఆయా వాహన యజమానుల బ్యాంక్ అకౌంట్లలో జమ అయ్యాయన్నారు. ఎన్నికల అనంతరం రెవెన్యూ, పోలీసు వారికి ఏర్పాటు చేసిన వాహనాలకు రూ.33 లక్షలు ఖాతాల్లో జమ చేయాల్సి ఉందన్నారు. ఎన్నికల తేదీ వరకు పోలీసు వారికి ఏర్పాటు చేసిన వాహనాలలో అనంతపురం హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన వాహనాలకు రూ.36 లక్షలు జమ అయ్యాయన్నారు. వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలీసు శాఖకు ఏర్పాటు చేసిన వాహనాలకు రూ.28 లక్షల రూపాయలు జమ చేయాల్సి ఉందన్నారు. వాహన యజమానులకు ఇంకా రావాల్సిన బకాయిలను త్వరలో విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు.

ఆంధ్ర సరిహద్దుకు తుంగభద్ర జలాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

తుంగభద్ర జలాలు ఆంధ్ర సరిహద్దుకు మంగళవారం సాయంత్రం చేరుకున్నాయి. బొమ్మనహళ్ మండలం తుంగభద్ర ఎగువ కాలువ 105వ కిలోమీటర్ వద్ద ఆంధ్ర రాష్ట్ర సరిహద్దులోకి మంగళవారం రాత్రి ప్రవేశించాయి. నీటి రాకతో స్థానికులు, రైతులు తుంగభద్ర జలాలకు పూజలు జరిపారు. అనుకున్న సమయానికి కాలువలకు నీరు రావడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తుంగభద్ర నుంచి జిల్లా సరిహద్దుకు వస్తున్న నీరు



బొమ్మనహాల్ జిల్లా సరిహద్దులో ప్రవహిస్తున్న నీరు

బాల్య వివాహాలను నియంత్రిద్దాం : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



బాల్య వివాహాల నియంత్రణ పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

జిల్లాలో బాల్య వివాహాలు ఒక్కటీ కూడా జరగకుండా నియంత్రించేలా అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో బాల్య వివాహాల నివారణ, కార్యాచరణ ప్రణాళికపై జిల్లాస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా చూసుకునే బాధ్యత అధికారులందరిపై ఉందన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు ఎందుకు జరుగుతున్నాయో స్వచ్ఛంద సంస్థలు దృష్టి సారించాలని, వాటి మూలాలపై ఆరా తీయాలన్నారు. జిల్లాలో టీనేజ్ ప్రెగ్నెన్సీకి సంబంధించిన నివేదిక అందించాలన్నారు. బాల్య వివాహాలను ఆపిన అనంతరం పిల్లలు ఎక్కడ ఉన్నారు ప్రతినెలా వెళ్లి పరిశీలించాలన్నారు. జిల్లాలో డివిజన్ స్థాయి కమిటీల సమావేశాలు ప్రతినెలా సజావుగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని పాఠశాలలకు టీచర్స్ అంతా వెళ్లేలా చూడాలని, పాఠశాలల్లోని తల్లిదండ్రుల కమిటీ సమావేశాల్లో పిల్లల అట్రాక్షన్, ఇతర విషయాలపై చర్చించాలన్నారు. విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌పై విద్యా సంస్థల్లో అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల నివారణపై మండల సమైక్య కార్యాలయాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. బాల్య వివాహాలు జరుగుతున్నాయన్న సంకేతాలు ఉన్న ప్రాంతాలను మండల, గ్రామాల్లో బ్లాక్ స్పాట్లను గుర్తించాలన్నారు. ఆధార్ కార్డులో వయస్సు మార్పుల నమోదును ఎవరైనా చేస్తే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే సమస్యలు, ఇబ్బందులు గురించి కేజీబీవీ, రెసిడెన్షియల్, ఇతర పాఠశాలల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సిడబ్ల్యుసి ఛైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, ఐసిడిఎస్ పీడీ బిఎన్.శ్రీదేవి, డిపిఒ ప్రభాకర్ రావు, ఎస్డీపీవో ప్రతాప్ కుమార్, డిఎంఎహెచ్ఒ డా॥ఈబి.దేవి, మెప్మా పీడీ విజయలక్ష్మి, డీఆర్డీఏ పీడీ ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

కెప్టెన్ లక్ష్మీ సెహగల్ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వర్ధంతి సెమినార్‌లో డాక్టర్ బాలాకుమారి



సెమినార్‌లో మాట్లాడుతున్న డాక్టర్ బాలాకుమారి

స్వాతంత్ర్య సమరయోధురాలు కెప్టెన్ డాక్టర్ లక్ష్మీ సెహగల్ సమాజానికి అందించిన వైవిధ్య భరితమైన సేవలు స్ఫూర్తిదాయకమని గైనకాలజిస్ట్ డాక్టర్ బాలాకుమారి, డాక్టర్ ప్రసూన అన్నారు. డాక్టర్ లక్ష్మీ సెహగల్ వర్ధంతిని పురస్కరించుకుని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి అధ్యక్షతన మంగళవారం నగరంలోని నలంద బాలికల జూనియర్ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. ముందుగా లక్ష్మీ సెహగల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలాకుమారి మాట్లాడుతూ కెప్టెన్ లక్ష్మీసెహగల్ స్త్రీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన ఇండియన్ డెమెక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా పని చేశారని గుర్తు చేశారు. మహిళా సమస్యలపై ఎంతో అవగాహన కలిగి, పరిష్కారానికి విశేష కృషి చేశారని తెలిపారు. వైద్య సేవల కొరత, ప్రసూతి సమయంలో వారు అనుభవించే ఆరోగ్య సమస్యలు, మాతాశిశు మరణాలు లక్ష్మీసెహగల్‌కు మానసికంగా బాధించాయని గుర్తు చేశారు. అందుకే ఆమె వైద్యురాలిగా విద్యనభ్యసించి అణగారినవర్గాల ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. అలాంటి వారి స్ఫూర్తితో మహిళలు చైతన్యవంతులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. అమ్మాయిలు అతిచిన్న వయసులోనే వయసుకు వస్తున్న పరిస్థితులు చూస్తున్నామన్నారు. బాలికలకు ఆరోగ్య పరిరక్షణపై సరైన అవగాహన ఉండదన్నారు. రక్తస్రావం, కడుపునొప్పి ఉంటే అనేక సమస్యలకు గురవుతుంటారని, అలాంటి విషయాలపై అవగాహనతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. శారీరక పరిశుభ్రత ఎంత అవసరమన్నారు. ఆడపిల్లలు సమతుల్య ఆహారం తీసుకోవాలని, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఆరోగ్య సమస్యల పట్ల ఎలాంటి అశ్రద్ధ వహించకూడదని కోరారు. డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ లక్ష్మీ సెహగల్ భోపాల్‌లో జరిగిన విషవాయ దుర్ఘటనతో అనారోగ్యానికి గురైన వారికి వైద్యసేవలు అందించారని, భారతదేశానికి వచ్చిన శరణార్థులకు వైద్య సేవలు అందించారన్నారు. ఆమె భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.సావిత్రి మాట్లాడుతూ లక్ష్మీసెహగల్ తన తల్లి అడుగుజాడల్లో నడిచిన జాతీయ ఉద్యమ నాయకురాలు అన్నారు. గాంధీ మార్గం నుంచి నేతాజీ యుద్ధరంగం వైపు దూసుకెళ్లిన కెప్టెన్ అని కొనియాడారు. సిపిఎం నాయకురాలిగా, గొప్ప వైద్యురాలిగా సేవలందించి రాష్ట్రపతి పదవికి పోటీ చేసిన తొలి భారతీయ మహిళగా లక్ష్మీ నిలిచారని తెలిపారు. ఆమె స్ఫూర్తితో మహిళలకు చైతన్యవంతులై సేవలు అందించాలని తెలిపారు. అనంతరం టీవీ టవర్ వద్ద ఉన్న పేదలు వేసుకున్న కాలనీలో ఆరోగ్య పరిరక్షణపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు చంద్రిక, నలంద కళాశాల అధ్యాపకురాలు ప్రసన్నలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తూరు పరమేష్, విద్యార్థినులు, టివి టవర్ కాలనీ నాయకులు ప్రమీల, రజినీ, ఇర్ఫాన్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్ ద్వారానే పౌష్టికాహారం పంపిణీ చేయాలి

సిడిపిఒ లక్ష్మీప్రసన్న

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు ఇచ్చే పౌష్టికాహారాన్ని ఎఫ్ఆర్ఎస్ ద్వారానే పంపిణీ చేయాలని ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీప్రసన్న సూచించారు. మంగళవారం మండల పరిధిలోని కోనాపురం, సూగేపల్లి, కొండాపురం, గ్రామాలలోని అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా నాలుగు అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి అంగన్వాడీ కార్యకర్తలు, పిల్లలు, బాలింతలు, గర్భిణులు, కిషోర్ బాలికల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు సమయపాలన తప్పనిసరి అన్నారు. రోజూ ఉదయం 9 నుంచి సాయంకాలం 4 గంటల వరకూ కేంద్రంలో ఉండాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించే 18 రికార్డుల్లో రోజూ వివరాలను నమోదు చేయాలన్నారు. ప్రతి కేంద్రంలో లబ్ధిదారుల ఆధార్ తప్పనిసరి అన్నారు. లేకపోతే లబ్ధిదారులకు పౌష్టికాహారం అందకుండా పోతుందన్నారు. అలాగే ఎఫ్ఆర్ఎస్ ద్వారానే స్టాక్ పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఖాసింబీ, రామాంజనమ్మ అంగన్వాడీ కార్యకర్తలు శాంతి, అంజనమ్మ, గుణమ్మ, పెన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులు, బాలింతలతో మాట్లాడుతున్న సిడిపిఒ లక్ష్మీప్రసన్న

జూనియర్ కళాశాలల్లో
మధ్యాహ్న భోజనాన్ని కొనసాగించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ డిమాండ్ చేశారు. మంగళవారం రాయదుర్గంలోని జూనియర్ కళాశాల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించారన్నారు. అయితే వైసిపి ప్రభుత్వం వచ్చాక ఈ పథకాన్ని నిలిపివేసిందన్నారు. దీంతో గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈనేపథ్యంలో టిడిపి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడంతో జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తిరిగి కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం రాయదుర్గం అధ్యక్షులుగా అనిల్, ఉపాధ్యక్షులుగా సందీప్, కార్యదర్శిగా భానుప్రకాష్, సహాయ కార్యదర్శిగా విష్ణు, కమిటీ సభ్యులుగా తిప్పేసి, శివారెడ్డి, సందీప్, వంశీ తదితరులను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ

బాలగంగాధర్ తిలక్, ఆజాద్కు నివాళి

ప్రజాశక్తి-గుత్తి

స్వాతంత్ర్య సమరయోధులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని పెన్షనర్ల భవనంలో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల అసోసియేషన్ తాలూకా అధ్యక్షులు కె.అబుబకర్, కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి జేన్నే కుళ్లాయిబాబు, నాయకులు నారాయణరెడ్డి, షేక్షావలి, శామ్యూల్, నారాయణ శెట్టి, హాసన్ అహ్మద్, వెంకటనారాయణ, రామదాసు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

రాయదుర్గం : చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని పురస్కరించుకుని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని వెంకటేశ్వర జూనియర్ కళాశాల ఆవరణలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయక కార్యదర్శి అంజి, ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కోట్రెష్, నాయకులు శశికుమార్, కార్తీక్, కుమార్నాయక్, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు బోనాలు



అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

అనంతపురం : ఆషాడమాసాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక చాకలి ఐనలమ్మ కాలనీలో గంగమ్మ జాతర నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటి నుంచి స్థానికులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.లింగమయ్య, జిల్లా కార్యదర్శి సివి.హరికృష్ణ, సివి లలిత, నాగప్ప, పెద్దలు నాగరాజు, పెయింటర్ భూషణ, వీరాంజి తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికడదాం

వజ్రకరూరు : బాల్య వివాహాలను అరికట్టి బాలికల బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దామని ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయకుమారి పిలుపునిచ్చారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారి డాక్టర్ బిఎన్ శ్రీదేవి ఆదేశాల మేరకు విడపనకల్లు మండల పరిధిలోని పాల్తూరు ప్రభుత్వ పాఠశాలలో గ్రామంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా బాల్య వివాహం చైల్డ్ హెల్ప్లైన్ 1098, బాల్య వివాహం వల్ల కలిగే అనర్థాలు, గుడ్టచ్ బ్యాడ్టచ్పై విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్తూరు ఎస్ఐ హుస్సేన్బాషా, ఐసిపిఎస్ ఔట్రీచ్ వర్కర్ వాల్మీకి రమాదేవి, స్కూల్ హెచ్ఎం అశ్వర్థమ్మ, జిఎంఎస్ కె.నాగమణి, అంగన్వాడీలు దుర్గదేవి, లక్ష్మీదేవి, రాధ, ఈరమ్మ, స్కూల్ సీనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి

కమిషనర్ పివివిఎస్.మూర్తి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో మురుగునీరు రోడ్లపైకి రాకుండా ఎప్పటికప్పుడు కాలువలను శుభ్రం చేయించాలని కమిషనర్ పివివిఎస్.మూర్తి సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం టవర్క్లాక్, సూర్యానగర్, పాతూరు, సంగమేశ్వర సర్కిళ్లలో చేపట్టిన పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ఇందులో భాగంగా లలిత కళాపరిషత్ వద్ద డిఆర్డిఎకు వెళ్లే రహదారిపై మురుగునీరు రోడ్డుపై చేరకుండా చర్యలు చేపట్టాలని అదనపు కమిషనర్ హరిబాబు, హెల్త్ ఆఫీసర్ విష్ణుమూర్తిని ఆదేశించారు. తర్వాత ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఆయా ప్రాంతాల్లో తాగునీటి సరఫరా సమయంలో వాల్వులను సక్రమంగా నిర్వహిస్తూ సమస్యలు రాకుండా చూడాలని ఆదేశించారు. అలాగే వివిధ పాయింట్ల వద్ద క్లోరినేషన్ తనిఖీలు సక్రమంగా నిర్వహించి రిజిస్టర్లో నమోదు చేయాలని సూచించారు. సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించే పక్షంలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావన్నారు. విధుల నిర్వహణలో అశ్రద్ధ చూపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే మెడికల్ కాలేజీ ఎదురుగా ఉన్న ఇంజినరేషన్ ప్లాంటును దర్శించారు.



కార్పొరేషన్ సిబ్బందితో కమిషనర్ పివివిఎస్.మూర్తి

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఉరవకొండలో వచ్చే నెల 6, 7వ తేదీల్లో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా 32వ ప్లీనరీ సమావేశాలకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఉరవకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ మస్తాన్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు, సామాజిక అంశాలపై ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. ప్రజాస్వామ్యం, సోషలిజం సిద్ధాంతాలతో అలుపెరగని కృషి చేస్తోందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధార్థ, తరిమెల గిరి, నాయకులు సోము, హిరణ్య మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం విద్యారంగ సమస్యలపై చేసిన ఉద్యమాలను గుర్తు చేసుకుంటూ భవిష్యత్తులో జరిగే ఉద్యమాలకు దిశానిర్దేశం చేసుకోవడానికి ఉరవకొండ వేదిక కాబోతుందన్నారు. ఉరవకొండలో అనేక విద్యార్థి సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి దశలవారీగా పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్, నందు, అశోక్, హర్ష, సాయి, తదితరులు పాల్గొన్నారు.



ప్లీనరీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



జగన్తో జెడ్పీ ఛైర్పర్సన్ బోయ గిరిజమ్మ

జగన్ను కలిసిన జెడ్పీ ఛైర్పర్సన్

అనంతపురం అర్బన్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ను ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజా పరిషత్ ఛైర్పర్సన్ బోయ గిరిజమ్మ మంగళవారం కలిశారు. కూటమి ప్రభుత్వం అరాచకాలకు నిరసనగా, రాజకీయ హత్యలను ఖండిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేశ రాజధాని ఢిల్లీలో తలపెట్టిన ధర్నాకు బోయ గిరిజమ్మ సంఘీభావం తెలిపారు.

కొనసాగిన పంచాయతీ వేలంపాట

పామిడి : పంచాయతీ ఆదాయ వనరుల కోసం మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం వివిధ రకాల వేలంపాటలు నిర్వహించారు. బస్టాండుకు సంబంధించి ఐదుగురు వేలంలో పాల్గొనగా ఆదినారాయణరెడ్డి రూ.2,15,000, జంతు వధశాలకు సంబంధించి వెంకటేష్ రూ.21,500 సొంతం చేసుకున్నారు. కాగా దినసరి మార్కెట్కు ఎవరూ పాల్గొనకపోవడంతో ఉన్నతాధికారుల అనుమతి పొందిన తర్వాత తిరిగి వేలయం వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, విస్తరణాధికారి శశికళ, జూనియర్ అబ్దుల్హుస్సేన్, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపకులాల కమిటీ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

గుంతకల్లు రూరల్ : ఎస్సీ, ఎస్టీ ట్రైబల్ కులాలకు చెందిన ఉపకులాల కమిటీ ఏర్పాటు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్నవారు ఆగస్టు 6వతేదీ వరకూ దరకాస్తు చేసుకోవచ్చున్నారు.

ఆధార్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడు, నాయినపల్లి సచివాలయాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఎంపిడిఒ రాముడు, ఇఒఆర్డి శైలజారాణి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆధార్ కేంద్రంలో మార్పులు, చేర్పులు చేసుకోవాలన్నారు.



ఆధార్ తీస్తున్న సిబ్బంది

ఆత్మకూరు : మండల కేంద్రంలోని పి.యాలేరు సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఎంపిడిఒ దశరథరామయ్య మంగళవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఎంతమంది ఆధార్ కోసం వస్తున్నారు.. ఎంతమందికి చేశారు.. అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 27వ తేదీ వరకూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా దుర్గమ్మ జాతర



అమ్మవారి వద్దకు ఊరేగింపుగా వెళ్తున్న గామస్తులు

శింగనమల : మండల పరిధిలోని సోదనపల్లిలో వెలసిన పెద్దమ్మ, దుర్గమ్మకు గ్రామపెద్దల ఆధ్వర్యంలో మంగళవారం బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆషాడ మాసంలో దుర్గమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి జాతర చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా అమ్మవారికి కుంకుమార్చనలు, అభిషేకాలు చేశారు. తర్వాత ప్రత్యేక పూల అలంకరణ చేసి అమ్మవారికి కోళ్లు, పొట్టేళ్లను బలి ఇచ్చారు. అనంతరం వర్షాలు కురిసి పంటలు పండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ అర్చకులు, ప్రజలు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్ధారణపై స్పెషల్ డ్రైవ్



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని మాముడూరు గ్రామంలో కుష్టువ్యాధి నిర్ధారణ సర్వేపై మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు మండల వైద్యాధికారి రాజేష్కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి వివిధ రకాల మచ్చలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ గంగాధర్రెడ్డి, హెచ్ఇఒ సత్యనారాయణ, ఆంజనేయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి : వైసిపి రైతుసంఘం

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందజేసి ఆదుకోవాలని వైసిపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎన్వి.నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఈనేపథ్యంలో వైసిపి ఆధ్వర్యంలో ఉద్యమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు చెన్నకేశవులయాదవ్, చితంబర్రెడ్డి, రవినాయక్, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

విలేకర్లు కావలెను

ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు క్రింది తెలిపిన మండల కేంద్రాల్లో విలేకర్లు కావలెను.

అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన

అనంతపురం జిల్లా
-: విలేకరులు కావలసిన ప్రాంతాలు :-
రాప్తాడు విడపనకల్లు వజ్రకరూరు కూడేరు
యల్లనూరు కంబదూర్ ఉరవకొండ రూరల్

ఇంటర్వ్యూ : తేది: 26-07-2024 శుక్రవారం ఉదయం 10 గంటలకు
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు : 9490099311,9490099312,313

ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం,
D.No: 42/2, Near Industrial Estate, Old VRL Transport Godown,
Bellary Road, Ananthapuramu

కేంద్ర బడ్జెట్పై కూటమి నేతల సంబరాలు

ప్రజాశక్తి-అనంతపురం

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించడం, రాష్ట్రంలో టైటిలింగ్ యాక్ట్ను రద్దు చేస్తూ తీర్మానం చేయడం పట్ల టిడిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈమేరకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచన మేరకు మంగళవారం నగరంలోని అర్బన్ పార్టీ కార్యాలయంలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు, పవన్కళ్యాణ్ రాష్ట్రాభివృద్ధి కోసం ఎంతో శ్రమిస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడం ద్వారా రాష్ట్ర రాజధాని అమరావతికి రూ.15వేల కోట్ల నిధులిచ్చారని గుర్తు చేశారు. అలాగే రాష్ట్రానికి జీవనాడిలా ఉన్న పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇచ్చి.. నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని చెప్పారన్నారు. ఇక పరిశ్రమలకు రాయితీలు, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు ఇస్తామని చెప్పడం హర్షించదగ్గ పరిణామమన్నారు. మరోవైపు రాష్ట్రంలో ప్రజలకు శాపంగా ఉన్న ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ను రద్దు చేస్తూ అసెంబ్లీలో ఏకగ్రీవం తీర్మానం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బుగ్గయ్య చౌదరి, డిష్ నాగరాజు, సుధాకర్యాదవ్, ఫిరోజ్ అహ్మద్, బండి కాశీ విశ్వనాథ్, జోగి రాజేంద్ర, నెట్టెం బాలకృష్ణ, గోళ్ల సుధాకర్ నాయుడు, తమ్మినేని వేణు, రాయల్ కొండయ్య, వన్నూరప్ప, మల్లెల దుర్గేష్, సుంకన్న, కుళ్లాయప్ప, కుమార్, బాలకృష్ణ, చలం, అమర్, బొమ్మినేని శివ, నేహా అయేషా, గడిపూటి సురేష్చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి మంచి రోజులు..

ఆత్మకూరు : ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్ల రాష్ట్రానికి మంచి రోజులు వస్తున్నాయని.. కేంద్ర బడ్జెట్లో కేటాయింపులే ఇందుకు నిదర్శనమని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపికి కేంద్రం ప్రత్యేక సాయం ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని, ఇప్పుడు చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు ఇస్తామని చెప్పడం హర్షించదగ్గ విషయమన్నారు. అంతేగాకుండా పోలవరం ప్రాజెక్టుకు 200 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో పూర్తి ఖర్చు కేంద్రం భరిస్తుందని చెప్పడం ద్వారా రాయలసీమకు కూడా నీటి కష్టాలు తీరే అవకాశం ఉందన్నారు. ఇండస్ట్రియల్ కారిడార్ ద్వారా వేల కోట్ల పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తాయన్నారు. విభజన చట్టంలో పొందుపర్చినట్లుగా వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పడం సంతోషం కల్గించిందన్నారు. రాయలసీమ, ప్రకాశం జిల్లా, ఉత్తరాంధ్రకు నిధులు కేటాయించడం వల్ల ఈ ప్రాంతాల్లో ఉన్న కష్టాలు కొంతైనా తీరుతాయన్నారు. ప్రస్తుతం అనంతపురం జిల్లాకు ఈ నిధులు ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. నీరు, విద్యుత్, రైల్వే, రోడ్లు ప్రాజెక్టులకు దశలవారీగా నిధులు కేటాయిస్తే.. ఇక రాష్ట్రం అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కేంద్రం ఈ విధంగా సాయం ప్రకటించడం వెనుక చంద్రబాబు ప్రయత్నం ఉందని.. ఒక మంచి నాయకుడు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రానికి ఇలా మంచి జరుగుతుందన్నారు.

ఎపికి ప్రాధాన్యత ఇదే ప్రథమం..

కేంద్ర ఆర్థికబడ్జెట్లో రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించడం హర్షణీయమని టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించిన బడ్జెట్లో రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడం సంతోషకరమన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు కృషివల్లే అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు కేటాయించారన్నారు. రాష్ట్ర విభజన అనంతరం కేంద్రం ఇంత వరకూ ఎపికి ఈస్థాయిలో ప్రాధాన్యత ఇవ్వడం ఇదే ప్రథమం అన్నారు. ఇటు చంద్రబాబు, అటు పవన్కళ్యాణ్ వ్యూహాత్మకంగా ఎన్డీఏలో చేరడం, కేంద్రంలో కీలకపాత్ర పోషించడం, తను మార్పు రాజకీయ మార్కు మలుచుకోవడం సంతోషకరమన్నారు.




ఆర్బికె వద్ద మొక్కలు నాటుతున్న అధికారులు

మొక్కలను నాటడం ప్రతిఒక్కరి బాధ్యత

పెద్దపప్పూరు : మొక్కలను నాటి సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎఒ ఆంజనేయులు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో వాతావరణ కాలుష్యం లేకుండా మంచి ఆక్సిజన్ తీసుకోవాలంటే భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే విధంగా పచ్చని చెట్లను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో హరినాథ్రెడ్డి, రజినీ, ఎఇఒ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భీమలింగేశ్వరుడి రథోత్సవం



రథోత్సవానికి హాజరైన భక్తులు

వజ్రకరూరు : ఉరవకొండ నియోజకవర్గంలోని విడపనకల్లు మండలం గడేకల్లులో వేములవాడ భీమలింగేశ్వరస్వామి రథోత్సవం మంగళవారం కన్నుల పండువగా సాగింది. ఇందులో భాగంగా తెల్లవారుజాము నుంచే స్వామివారి జీవసమాధి, మూలవిరాట్కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మహా మంగళహారతి, తదితర పూజలు చేశారు. తర్వాత భక్తులు స్వామివారికి టెంకాయలు, మద్యం నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రథానికి ప్రత్యేక పుష్పలంకరణ చేసారు. బలిహరణ తదితర పూజల అనంతరం ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలతో తీసుకొచ్చి రథంపై కొలువుదీర్చారు. అశేష జనవాహిణి మధ్య భీమలింగేశ్వరస్వామి రథోత్సవం కమణియంగా సాగింది. వేలాదిమంది భక్తుల భీమలింగేశ్వర నామస్మరణతో గడేకల్లు పులకించింది.

ఘనంగా పామిడమ్మ జాతర

పామిడి : పట్టణంలోని జాతీయ రహదారి సమీపంలో గ్రామ దేవతగా వెలసిన పామిడమ్మ జాతరను మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతిఏటా విఠోబా స్వాముల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉట్లతేరు ముగిసిన అనంతరం ఆషాడ బహుళ తదియ మంగళవారం పామిడమ్మ జాతరను నిర్వహించడం ఆనవాయితీ అని పూజారి సంజీవ తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల రద్దీతో పామిడమ్మ ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.



పామిడమ్మ దర్శనానికి వెళ్తున్న భక్తులు

నేడు జాషువా వర్ధంతి

అనంతపురం : నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా వర్ధంతిని జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్నట్లు పీఠం కార్యదర్శి నాగలింగం, ఎస్కెయు తెలుగు శాఖ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం ఆర్ట్స్ కళాశాల ప్రధాన గేటుకు ఎదురుగా ఉన్న మహాకవి గుర్రం జాషువా విగ్రహానికి పుష్పమాలంకరణ చేయనున్నట్లు తెలిపారు. తర్వాత ఆర్ట్స్ కళాశాలలోని కామర్స్ సెమినార్ హాల్లో జాషువా సాహిత్యంపై సాహితీ సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తర్వాత జాషువా సాహిత్యంపై నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విజేతకు బహుమతుల ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కావున సాహితీవేత్తలు, జాషువా సాహిత్య అభిమానులు, విద్యార్థులు, మేధావులు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

అనంతపురం : అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ఎం.మునిరామయ్య ఆదేశాల బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని చౌకదుకాణాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రేషన్ దుకాణంలోని రికార్డులు, భౌతిక నిల్వల్లో వ్యత్యాసాలను గుర్తించారు. దీంతో భౌతిక నిల్వలను జప్తు చేసి స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు శ్రీనివాసులు, జె.వాసుప్రకాష్, విజయలక్ష్మి, బుక్కరాయసముద్రం డిప్యూటీ తహశీల్దార్ పి.నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి సంఘం మండలాధ్యక్షుడిగా హరి



శింగనమల : వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడిగా నల్లబోతుల హరి మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వాల్మీకి సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ క్రాంతినాయుడు, జక్కల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అనంతపురంలోని వాల్మీకి భవనంలో కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ సమాజంపై తనకున్న అంకితభావం, నిబద్ధత ఆధారంగా రెండోసారి వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. వాల్మీకుల హక్కులు, అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

మాదకద్రవ్యాలపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ నబిరసూల్

గుత్తి : పట్టణంలోని జడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలో మంగళవారం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై బి.నబిరసూల్ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపు

రాయదుర్గం : పట్టణంలోని దుగ్గిలమ్మ ఆలయ సమీపంలో ఉన్న పరిసరాల్లో పేరుకుపోయిన ముళ్లపొదలను మున్సిపల్ అధికారులు మంగళవారం జెసిబి సాయంతో శుభ్రం చేశారు. ముళ్లపొదలు పెరిగి గుంతల్లో వర్షం, మురికినీరు నిల్వ ఉండి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ఈనేపథ్యంలో త్వరలో దుగ్గిలమ్మ జాతర జరగనుండటంతో ఆలయ పరిసరాలను శుభ్రం చేయాలని టిడిపి నాయకులు బిఎం నాదేఅలీ, కరన్న, తిప్పేస్వామి తదితరులు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులకు చేసిన విజ్ఞప్తి మేరకు మున్సిపల్ కమిషనర్ పి.కిషోర్ మంగళవారం జెసిబిని తీసుకొచ్చి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు.



ముళ్ల పొదలను తొలగిస్తున్న నాయకులు, అధికారులు



అత్యున్నత విద్యాశిఖరం.. అనంత జెఎన్‌టియు..!

వార్త 4లో

ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక

విద్యాదర్శిని

అనంతపురం, శ్రీ సత్యసాయి (జిల్లా) ప్రత్యేక అనుబంధం

8 పేజీలు | బుధవారం | 24 జులై, 2024

శ్రీ ప్రగతి విద్యానికేతన్ ఇంగ్లీషు మీడియం హై స్కూల్

SREE PRAGATHI VIDYANIKETHAN · Estd. 1998 · SYNDICATE NAGAR, ANANTAPURAMU

నర్సరి నుండి 10 వ తరగతి వరకు

సిండికెట్ నగర్, అనంతపురము సెల్ :- 8978824709

(ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాల)

2023-2024 విద్యా సంవత్సరములో అద్భుత ఫలితాలు సాధించిన మా విద్యార్థులు..

పి. చక్రి 557/600 Maths 100/100

సి. సునీత 556/600 Maths 100/100

కె. శ్రీలేఖ 487/600
బి. దివ్యశ్రీ 480/600
ఆర్. శశికళ 475/600
జి. పూజిత 472/600
పి.లక్ష్మి 457/600
పి.సుబీహా 446/600
యస్. వర్ష 444/600
కె.కుళ్ళాయిస్వామి 399/600
ఆర్. హారిక 351/600
వి. వన్నూర్‌స్వామి 308/600

జి. అక్షయ 550/600
జి. పరిమళ 522/600
ఎన్. మల్లీశ్వరి 505/600

యం. సతీష్ 550/600 Maths 100/100
వి. సుశాంత్ 519/600



2024 SSC లో 100% ఉత్తీర్ణత

అడ్మిషన్లు జరుగుచున్నవి

పరీక్షలు వ్రాసినవారు : 17

పరీక్షలు పాసైన వారు : 17

మా పాఠశాల ప్రత్యేకతలు :-

* నూతన సొంత పక్కా భవనాలతో అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా అన్ని వసతులతో విద్యాబోధన.
* పూర్తి ట్రైన్డ్ టీచర్స్ తో క్రమశిక్షణతో కూడిన విద్యను అందించబడును.
* ఎటువంటి అదనపు "ఫీ" వసూలు చేయకుండానే అనుభవజ్ఞుల పర్యవేక్షణలో పూర్తి ల్యాబ్ ఎక్విప్‌మెంట్ సౌకర్యం మరియు కంప్యూటర్ ఎడ్యుకేషన్ అందించబడును.
* చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ మరియు ఉదయం, సాయంత్రం ఉచితంగా ఏ రోజుకారోజు పాఠ్యాంశాలను చదివించేందుకు పర్యవేక్షకులతో " స్టడీ అవర్స్ " నిర్వహించబడును.



శ్రీమతి ఎం.సౌభాగ్యలక్ష్మి
M.A.,M.A.,B.Ed.,PGDCA
హెడ్‌మిస్ట్రస్



శ్రీ డా॥ జి.వరదరాజులు
M.A.,LLB.,B.Sc.,B.Ed.,M.A.M.S.,
కరస్పాండెంట్.
సెల్ :- 8978824709

ఏ సంవత్సరమునకు ఆ సంవత్సరము అభివృద్ధి చెందుతూ ఈ విద్యా పోటీ ప్రపంచము నందు ముందు ముందుకు దూసుకుపోతున్న విద్యా సంస్థ **శ్రీ ప్రగతి విద్యానికేతన్** ఈ పాఠశాల ఈ విద్యాసంవత్సరము 2023-24 నందు 26వ వసంతంలోకి అడుగిడుతున్న శుభతరుణంలో మా విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులకు ఇవే మా ప్రగతి అక్షరాభి వందనములు.

శ్రీ వివేకానంద జూనియర్ కళాశాలలు
అనంతపురం

We Promise A Better Tomorrow

Boys Campus : SKU Road, Ananthapuramu. ✆ : 8008886550, 7989425938

Girls Campus : SKU Road, Ananthapuramu. ✆ : 9492495672, 8519981528

Day Scholar Campus : Raj Towers, Kamala Nagar, Ananthapuramu. Cell : 9440833491, 9398025671

Penukonda : GIC Colony, Penukonda, Sri Sathya Sai Dist., ✆ : 9676031663

ఇంటర్మీడియట్ 2024 సం॥ నందు అత్యధిక మార్కులు సాధించిన మా విద్యార్థులు

రాష్ట్రంలోనే అత్యధిక మార్కులు 1st MARK STATE

Jr. MPC — K. MANJUNATH 467/470 HT No. 2425122303

Jr. BiPC — P. POSHANA 434/440 HT No. 2425110265

Jr. CEC — P. ANKITHA MUNEPPA 487/500 HT No. 2425127053

Sr. MPC — S. Alisha 983/1000 HT No. 2425217101

Sr. BiPC — D. Kaveri 965/1000 HT No. 2425214374

Sr. CEC — N. Harshitha 964/1000 HT No. 2425214424



Boys Campus





Girls Campus



Day Scholar Campus

Groups offered:
MPC with JEE Mains
Bi.PC with NEET
MPC with EAPCET
Bi.PC with EAPCET
CEC/MEC

"మారుతున్న ప్రపంచాన్ని ఎదర్కొనే మేధా సంపత్తిగల విద్యార్థులుగా తయారు చేయ్యడం శ్రీ వివేకానంద కర్తవ్యం"



Sri K. Ravindra Chowdary
M.Sc., M.Phil., (Ph.D)., FTPT (Canada)
Correspondent

క్వాలిటీ విద్యకు కేరాఫ్ 'మోక్షిత్' స్కూల్

ప్రజాశక్తి-అనంతపురం

అధునాతన తరగతి గదులు, ఉన్నత విలువలతో క్వాలిటీ విద్యకే కేరాఫ్‌గా విన్సెంట్‌ఫెర్రర్ నగర్‌లోని షిర్డీసాయి మోక్షిత్ స్కూల్ నిలుస్తోంది. పేదింటి విద్యార్థులకు నేస్తంగా పాఠశాల విరాజిల్లుతోందని పాఠశాల కరస్పాండెంట్ కె.సుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో వారు మాట్లాడుతూ అధునీకరించిన తరగతి గదులతో నూతన విద్యావిధానానికి శ్రీకారం చుట్టామన్నారు. అందరికీ విద్య... అందరి బాధ్యతగా అభివర్ణించారు. విద్యాసంస్థను విద్యావేత్తలే నడిపితే ప్రతి విద్యార్థి భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో అత్యుత్తమ బోధన అందిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధతో చదువులో రాటుదేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సిసిటివి పర్యవేక్షణలో నిరంతరం విద్యార్థుల పట్ల పర్యవేక్షణ ఉంటుందన్నారు. మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లీషు సబ్జెక్ట్‌లకు ల్యాబ్‌లు ఏర్పాటు చేశామన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, మ్యాథ్స్‌పై ప్రత్యేక ఫోకస్ ఉంటుందన్నారు.



విద్యార్థినిని ఆశీర్వదిస్తున్న కరస్పాండెంట్ కె.సుబ్బారెడ్డి, హెచ్.ఎమ్.లక్ష్మీసుబ్బారెడ్డి



పాఠశాలలో కార్యక్రమానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

వీక్లీ సిడిఎఫ్, వీకెండ్ ఎగ్జామ్, గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహిస్తూ విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఏటా వచ్చే వివిధ పండుగల విశిష్టత తెలిపేలా దినోత్సవాలు నిర్వహిస్తూ విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ అవేర్‌నెస్ తీసుకువస్తున్నామన్నారు. మరింత ఉన్నతంగా విద్యాబోధన అందించడమే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు.

డిజిటల్ విద్యాబోధనలో

'విజయ స్కూల్'

ప్రజాశక్తి-అనంతపురం

